# అడుగంటిన భూగర్భ జలాలు

● జలాశయాల్లో తగ్గుతున్న నీరు ● 26 జిల్లాల్లో కరువు పరిస్థితులు


అడుగంటిన మెట్టూరు డ్యాం

ప్యారీస్, మే 9: రాష్ట్రంలో మండుటెండల కారణంగా భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. దీనిపట్ల జలవనరుల విభాగం అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొన్నాళ్లు కొనసాగితే పడమటి మండలాల్లో తీవ్రమైన నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రధాన నదుల్లో నీటిమట్టం క్రమంగా తగ్గుతుండడంత నీటియెద్దడి నెలకొంది. మరో వైపు వ్యవసాయ భూములకు సాగునీరు అందటం లేదని అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. గత యేడాది ఏప్రిల్‌తో పోల్చితే ఈ యేడాది రాష్ట్రంలోని 26 జిల్లాల్లో భూగర్భజలాలు గణనీయంగా తగ్గాయి. ధర్మపురి జిల్లాలో భూగర్భజలాలు 5.78 మీటర్ల దిగువకు చేరింది. దీంతో ఆ జిల్లాలో నీటి కష్టాలు మొదలయ్యాయి. అదే విధంగా నామక్కల్ జిల్లాలో 6.13 మీటర్ల నుంచి 9.34 మీటర్లకు భూగర్భ జలాల మట్టం తగ్గాయి. సేలం, కృష్ణగిరి, తిరుప్పూరు తదితర పడమటి జిల్లాల్లో ఊహించని విధంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గత యేడాది కంటే 9.4 మీటర్ల నుంచి 10.85 మీటర్ల మేర నీటి మట్టం తగ్గిందని, పరిశ్రమలు అధికంగా ఉన్న కోయంబత్తూరు జిల్లాలో ఇంతకంటే పరిస్థితి దారుణంగా ఉందంటూ అధికారులు తెలిపారు. ఇక రాజధాని నగరం చెన్నైలో భూగర్భజలాలు 0.5 మీటర్ల లోతుకు తగ్గాయి. మరో వైపు నగరానికి మంచినీరందించే పుళల్, చెంబరంబాక్కం, పూండి, చోళవరం, కన్నన్ కోట -తేర్వాయ్ కండిగ జలాశయాల్లో ఎండవేడికి నీరంతా ఆవిరవుతుండటంతో నీటిమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. పెరంబలూరు, తిరుచ్చి, తిరుపత్తూరు జిల్లాల్లో కూడా నీరు అంతంత మాత్రమే నిల్వగా ఉంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దక్షిణ జిల్లాలైన తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, విరుదునగర్‌లలో కురిసిన భారీ వర్షాలకు ఏర్పడిన వరదల కారణంగా భూగర్భ జలాలు పెరిగాయి. ఆ జిల్లాల్లో వాననీటి సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అవగాహన ప్రచార కార్యక్రమాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. సాగునీటి కొరత వల్ల ఈ యేడాది రైతులు ఆరుతడి పంటలకు బదులు పొడినేలల్లో నాట్లు వేశారు. సిరులు కురిపించే వరి, కంది తదితర ధాన్యాలను పండించుకోలేకపోవడంతో రైతన్నలు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతో తగ్గిన భూగర్భ జలాల మట్టాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నీటి సమస్యపై జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రం వంటి పొరుగు రాష్ట్రాలతో పోల్చితే నీటి నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సరిపోలేదన్నారు. ప్రధాన పథకాలను అమలు పరిచేందుకు విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందని, ప్రధానంగా అడుగంటిన భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంచేందుకు, మొరాయించిన బోర్‌వెల్స్ పైప్‌లైన్లను తొలగించి కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# నేడు అక్షయ తృతీయ

కొనుగోలుదార్లపై రాయితీల వర్షం ● నగల దుకాణాల వద్ద భారీ ఏర్పాట్లు



చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ నగల దుకాణాలన్నీ అక్షయ తృతీయ విక్రయాలకు సిద్ధమయ్యాయి. అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే ఇళ్ళల్లో అష్టైశ్వర్యాలు కలుగుతాయని ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం. సవర్ల కొద్దీ బంగారు నగలను కొనకపోయినా కనీసం ఒకటి రెండు గ్రాముల బంగారు కాసైనా కొందామని నగరవాసులంతా నగల దుకాణాల వైపు పరుగులు తీస్తుంటారు. ఈ యేడాది అక్షయ తృతీయ శుక్రవారం ఉదయం 6.33న ప్రారంభమై, శనివారం వేకువజాము 4.56 గంటల వరకూ ఉంటుంది. దీంతో నగరంలోని టి.నగర్, పురుషవాక్కం, ప్యారీస్ కార్నర్‌లోని బహుళ అంతస్తుల నగల దుకాణాల నుంచి వీధుల్లో చిన్న దుకాణాల వరకు అక్షయ తృతీయకు అందమైన డిజైన్లతో రూపొందించిన నగలు, వజ్రాభరణాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వినియోగదారులకు రాయితీలను ప్రకటించిన నగల దుకాణాల యజమానులు అక్షయ తృతీయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. టి.నగర్‌లో ప్రముఖ నగల దుకాణాల్లో బరువు తక్కువగా ఉన్న నెక్లెస్, గాజులు, చెవి కమ్మలు, ఉంగరాలు, చైన్లు కొత్త మోడళ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. అక్షయ తృతీయ శనివారం వేకువజాము వరకు ఉండటంతో పలు నగల దుకాణాలను శుక్రవారం అర్ధరాత్రి వరకూ తెరచి ఉంచేందుకు యజమానులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే అన్ని నగల దుకాణాలు తెరచుకోనున్నాయని నగల వ్యాపారుల సంఘం నాయకులు తెలిపారు. గత యేడాది అక్షయ తృతీయ కంటే ఈ యేడాది నగల అమ్మకాలు 25 శాతం పెరగవచ్చని పేర్కొన్నారు.

# కుమరిలో అదే ఉధృతి

ఐదో రోజూ 'అల'జడి


కన్నియాకుమారి సంగిలితురై వద్ద ఎగసిపడుతున్న అలలు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో ఐదో రోజూ సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉంది. తీరం వైపు కొన్ని చోట్ల సముద్రం నీటి మట్టం కాస్త తగ్గినట్లుగా కనిపించినా త్రివేణి సంగమ ప్రాంతంలో హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దీంతో పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్ళకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. దక్షిణాది జిల్లాల సముద్రతీర ప్రాంతాల్లో మినీ సునామీని తలపించేలా అలలు ఎగసిపడుతున్నాయి. ఈ నెల 4న కన్నియాకుమారి తీరం పొడవునా చిన్నముట్టం రేవు ప్రాంతం వద్ద పది నుండి ఇరవై అడుగుల ఎత్తువరకూ అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. త్రివేణి సంగమ ప్రాంతంలోని సంగిలితురై కడలి వద్ద పర్యాటకులు స్నానం చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే గత నాలుగు రోజులుగా ఆ ప్రాంతానికి పర్యాటకులు వెళ్లకుండా పోలీసులు నిఘా వేశారు. దీంతో గురువారం ఉదయం కూడా పర్యాటకులు త్రివేణి సంగమం వద్ద సూర్యోదయ దృశ్యాన్ని వీక్షించలేకపోయారు.

**వెనక్కి మళ్ళిన సముద్రం..**

గురువారం ఉదయం కన్నియాకుమారి వివేకానంద స్మారక మండపం వైపు సముద్రతీరం యాభై అడుగుల మేర వెనక్కి మళ్ళింది. దీంతో తీరంలోని ఇసుక తిన్నెలు, నాచు, చెత్తాచెదారం బయటపడ్డాయి. ఈ కారణంగా వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాలకు బోట్ సవారీని నిర్ణీత సమయంలో ప్రారంభించలేకపోయారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కావాల్సిన బోట్ సవారీని పూంపుహార్ సంస్థ రద్దు చేయడంతో పర్యాటకులు నిరాశతో తిరుగుముఖం పట్టారు. అదే సమయంలో కన్నియాకుమారి, చిన్నముట్టం, వావత్తురై, కోవళం, కీళమనక్కుడి, మనక్కుడి ప్రాంతాల్లో రాక్షస అలలు తీరం వైపు దూసుకువచ్చాయి. ఈ ప్రాంతాల్లో సముద్రతీరంలో ఉదయం నుంచే అలజడి అధికమైంది. ఈ ప్రాంతాల్లో కడలి వైపు ఎవరూ వెళ్ళకూడదంటూ పోలీసులు మైకుల్లో హెచ్చరించారు.


కమిషనర్ రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న వాహన చోదకుడు

# ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ నెట్

● 8 చోట్ల వాహనచోదకులకు ఉపశమనం
● ప్రారంభించిన కార్పొరేషన్ కమిషనర్

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెండు మూడు నిమిషాలపాటు నిలిచే వాహన చోదకులకు నీడనిచ్చేలా గ్రీన్ నెట్స్ ఏర్పాటు చేసే కార్యక్రమాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ గురువారం ప్రారంభించారు. తొలి విడతగా నగరంలో కీలకమైన ఎనిమిది ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఒకే సమయంలో ఈ గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిపాలనా భవనం రిప్పన్ భవనం ప్రహరీని ఆనుకుని ఉన్న పెరియమేట్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్‌నెట్‌ను కమిషనర్ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా వాహన చోదకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ... వాహన చోదకులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెండు మూడు నిమిషాల పాటు నిలబడాల్సి వస్తోందని, అయితే ఎండ కారణంగా వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందుకే వారికి నీడనిచ్చేలా గ్రీన్‌నెట్స్ ఏర్పాటు చేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయించిందన్నారు. తొలివిడతగా ఎనిమిది ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ నెట్స్ ఏర్పాటు చేశామని, త్వరలో మరిన్ని సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

**శునకాల పెంపకానికి లైసెన్స్ తప్పనిసరి...**

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఇళ్ళల్లో శునకాలు పెంచేందుకు లైసెన్స్ తప్పనిసరి అనీ, లైసెన్స్ లేకుంటే రూ.1000ల వరకు జరిమాన చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఇటీవల నుంగంబాక్కం గార్డెన్‌లో రెండు పెంపుడు శునకాలు కరవటంతో సురక్షా అనే బాలిక తీవ్రంగా గాయపడి సంఘటన తర్వాత శునకాల సంచారం, వాటి పెంపకం దార్లపై కార్పొరేషన్ అధికారులు దృష్టిసారిస్తున్నారని తెలిపారు. విదేశీ సంతతికి చెందిన శునకాలను వాటి పెంపకం దార్లు వీధుల్లో విడిచిపెడుతున్నట్లు తమకు తెలిసిందని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం పెంపుడు శునకాల కోసం నగరంలో వెయ్యిమందికి పైగా దరఖాస్తు చేశారని, వారికి త్వరలో లైసెన్స్ బిళ్లలను అందజేస్తామని తెలిపారు. రెండు మూడు రోజల తర్వాత కార్పొరేషన్ కార్మికులు నగరంలోని అన్ని వీధుల్లో సంచరించే శునకాలను పట్టనున్నారని, దీంతో వీధుల్లో శునకాల బెడద తప్పుతుందన్నారు.


రిప్పన్‌భవనం సమీపంలోని పెరియమేట్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్

జూన్ 22న విజయ్ జన్మదినం సందర్భంగా

# మదురైలో టీవీకే మహానాడు




ప్యారీస్, మే 9: ప్రముఖ సినీనటుడు విజయ్ జన్మదినం సందర్భంగా ఆయన సారథ్యంలోని 'తమిళగ వెట్రి కళగం' తొలి మహానాడు జూన్ 22న మదురైలో జరుగనుంది. ఈ మహానాడుకు సంబంధించిన తొలివిడత పనులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ప్రారంభించినట్లు గురువారం పార్టీ నిర్వాహకులు తెలిపారు. తమిళ చిత్రసీమలో అగ్రనటుడిగా రాణిస్తున్న విజయ్ ఫిబ్రవరిలో తమిళగ వెట్రి కళగం అనే పేరుతో రాజకీయపార్టీ ప్రారంభించిన విషయం తెలిసిందే. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయమని, 2026 అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా పనిచేస్తామని విజయ్ ప్రకటించారు. దీంతో పార్టీలో రెండు కోట్ల మందిని సభ్యులుగా చేర్చుకొనే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పార్టీ మెంబర్‌షిప్ డ్రైవ్ ముమ్మరంగా జరుగుతోంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో, విద్యావంతులైన యువతను పార్టీలో సభ్యులుగా చేర్చుకొని వారి ద్వారా పార్టీ అజెండాను ప్రజల్లోకి చేర్చాలని విజయ్ నిర్ణయించారు. ఇప్పటివరకు పార్టీలో సభ్యులుగా చేరిన సంఖ్య సుమారు కోటికి చేరువైంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఉన్న 234 నియోజకవర్గాలను తమ పార్టీ నిర్వహణకు అనుకూలంగా వందకు విభజించి నిర్వాహకులను నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడించాక రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు విజయ్ ఇటీవల ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుచుకొని అధికారంలో కూర్చోవాలన్న లక్ష్యంతో మహానాడు నిర్వహించి తమ బలాన్ని ప్రజలకు చాటేందుకు సిద్ధమయ్యారు. మదురైలో నిర్వహించనున్న ఈ మహానాడు వేదికపై పార్టీ జెండా, సిద్ధాంతాలను ఆవిష్కరించనున్నారు. మహిళలు, యువతను ఆకర్షించేలా పార్టీ పనితీరు గురించి విజయ్ ప్రకటించే అవకాశముందని పార్టీ నిర్వాహకులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను చెన్నై క్యాంపు కార్యాలయంలో కలుసుకుని అగ్గిపుల్లలతో రూపొందించిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి, కలం రూపాలను అందజేస్తున్న కన్నియాకుమారి జిల్లాకు చెందిన కళాకారుడు ఆర్ఎం వివేక్



# కందనూరు మధుకు పితృవియోగం


సీతారామయ్య (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): 'వేదవిజ్ఞాన వేదిక' ప్రధాన కార్యదర్శి, తెలుగు ప్రముఖుడు కందనూరు మధుకు పితృవియోగం కలిగింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి డాక్టర్ కందనూరు సీతారామయ్య (90) నగరంలో కన్నుమూశారు. సీతారామయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వుండగా, వారిలో రెండో కుమారుడే మధు. 2019 నుంచి పక్షవాతంతో బాధపడుతున్న సీతారామయ్య.. వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. మెహతానగర్‌లోని తన చిన్న కుమారుడైన డాక్టర్ శ్రీరాం వద్ద వుంటున్న ఆయన.. బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. గురువారం ఆయన భౌతికకాయానికి నుంగంబాక్కంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. నెల్లూరు జిల్లా లేబూరుకు చెందిన సీతారామయ్య.. 1950వ దశంలో మద్రాస్ నగరంలోనే వైద్య విద్యాభ్యాసం చేశారు. అనంతరం నెల్లూరు, గూడూరులో వైద్య వృత్తి సాగించారు. గూడూరులో నాలుగున్నర దశాబ్దాల పాటు వైద్యసేవలందించారు. తమకు ఎంత పెద్ద రోగమొచ్చినా ఆయన హస్తవాసితో నయమైపోతుందని అప్పట్లో అక్కడి స్థానికులకు ఎంతో విశ్వాసం ఉండేది. 1951-52 ప్రాంతంలో పొట్టి శ్రీరాములు దీక్ష, ఆ తరువాత ఆత్మార్పణ జరిగాక, మద్రాసుతో గూడిన ఆంధ్ర రాష్ట్రం కావాలన్న నినాదంతో జరిగిన ఆందోళనల్లోనూ సీతారామయ్య పాల్గొన్నారు. ఈ ఆందోళనలకు నేతృత్వం వహించిన 'చెన్నపురి ఆంధ్ర విద్యార్థి సమితి'లో సీతారామయ్య క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరించారు. హేమాహేమీలైన ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాథం, బెజవాడ గోపాలరెడ్డి, స్వామి సీతారాం, నీలం సంజీవరెడ్డి, కడప కోటిరెడ్డి, తరిమెల నాగిరెడ్డి లాంటి గొప్ప నేతల్ని, వారి పని తీరు దగ్గరి నుంచి గమనించిన వారిలో ఆయనా ఒకరు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయాన మద్రాస్ నగరంలో ఏర్పడిన ఘటనలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. 1964 నుంచి రోటరీ క్లబ్ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన.. వివిధ దేశాల్లో పర్యటించి మన దేశ సంస్కృతీ సంప్రదాయాలపై ఉపన్యసించారు. 2007లో ఆయన సతీమణి శ్రీలక్ష్మి కన్ను మూయడంతో తీవ్ర మనోవేదనకు గురైన సీతారామయ్య.. అప్పటి నుంచి వైద్య సేవలకూ విరామం ప్రకటించారు. ఇదిలా వుండగా సీతారామయ్య మృతి పట్ల నగరంలోని పలువురు తెలుగు ప్రముఖులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

# అంతా సవ్యమేనా?

● స్ట్రాంగ్ రూంల వద్ద మొరాయిస్తున్న సీసీ కెమెరాలు!

అడయార్, మే 9: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచిన కొన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్న వార్తలు రాజకీయ పార్టీలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ చెన్నై, నీలగిరి, మదురై, ఈరోడ్, తెన్‌కాశి, విల్లుపురం వంటి లోక్‌సభ స్థానాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ లలో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు చెడిపోయినట్టు సమాచారం. దీంతో ఎన్నికల సంఘం అధికారులపై రాజకీయ పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భారీ భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కల్పిస్తున్నారు. తొలి అంచెలో సాయుధ పోలీసులు, రెండో దశలో తమిళనాడు స్పెషల్ పోలీసులు, మూడో అంచెలో తమిళనాడు పోలీసులు భద్రతలో నిమగ్నమైవున్నారు. అలాగే, ఈ స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ, పరిసర ప్రాంతాల్లో వందలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, స్ట్రాంగ్ రూంల వద్ద ఏం జరుగుతుందో అన్ని పార్టీల అభ్యర్థులు 24 గంటల పాటు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో సౌత్ చెన్నై లోక్‌సభ స్థానం ఈవీఎంలున్న స్ట్రాంగ్ రూం వద్ద అమర్చిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించారు. ఈ లోక్‌సభ స్థానానికి సంబంధించిన అన్ని ఈవీఎంలను గిండిలోని అన్నా విశ్వవిద్యాలయంలో భద్రపరిచారు. ఈ రూం వద్ద 210 సీసీ కెమెరాలను అమర్చగా, బుధవారం అర్ధరాత్రి నుంచి ఈ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించారు. బుధవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో వర్షం కురవడంతో ఈ కెమెరాలు పనిచేయడం లేదని తెలుసుకున్న రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగమేఘాలపై స్పందించిన ఈసీ అధికారులు... పనిచేయని కెమెరాలను తొలగించి కొత్తవి అమర్చినట్లు తెలిపారు. ఇదే విషయంపై రాజకీయ నేతలు స్పందిస్తూ రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ముగిసిన 45 రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు జరుగనుందని, అప్పటివరకు స్ట్రాంగ్ రూమ్‌లకు ఎన్నికల సంఘం భద్రత కల్పించాల్సి ఉందన్నారు. అయితే రాత్రి సమయాల్లో అకాల వర్షం కారణంగా కొన్ని కేంద్రాల్లోని కెమెరాలు పనిచేయడం లేదని, వాటిని గుర్తించి తక్షణం సరిచేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం అధికారు లు అలసత్వం ప్రదర్శించడం ఏమాత్రం న్యాయ సమ్మతం కాదని వారు అభిప్రాయపడుతున్నారు.


అన్నా యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూం వద్ద ఈసీ అధికారులు (పాతచిత్రం)

## సమాచార దర్శిని

### నేటినుంచి ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 9: ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు శుక్రవారం నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవ చ్చు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విడుదల కానున్నాయి.ఫలితాల అనంతరం 102 ప్రభుత్వ, 305 ప్రైవేటు ఐటీఐల్లో అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తులు సమర్పించవచ్చు. 8, టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు జూన్ 7వ తేదిలోగా www.ski-lltraning.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### కొళత్తూర్-నాదముని మధ్య మెట్రో పనులు

ఐసిఎఫ్, మే 9: స్థానిక కొళత్తూర్-నాదముని మధ్య మెట్రో సొరంగపనులు ప్రారంభమయ్యాయి. నగరంలో రెండో విడతలో మొత్తం ఉన్న మూడు మార్గాల్లో షోలింగనల్లూర్-మాధవరం మార్గంలో కొళత్తూర్-నాదముని మధ్య మెట్రో సొరంగం ఏర్పాటుకు స్థలసేకరణ పూర్తయింది. సొరంగం తవ్వే పనులకు వందకు పైగా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ప్రస్తుతం ప్రారంభమైన సొరంగం తవ్వే పనులు 2025 ఫిబ్రవరిలో పూర్తయి 2026 రైలు సేవలు అందుబాటులోకి వస్తాయని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

### మెట్రోవాటర్ బోర్డు కార్యాలయాల చిరునామా మార్పు

ఐసిఎఫ్, మే 9: స్థానిక అన్నానగర్ మండలం 200వ వార్డులోని తాగునీటి బోర్డు కార్యాలయం శుక్రవారం నుంచి కీల్పాక్కం ఆలయ వీధి నెం.4/1 చిరునామాకు మారనుందని అధికారులు తెలిపారు. అలాగే, 101వ వార్డు బోర్డు కార్యాలయం న్యూ ఆవడి రోడ్డు, కీల్పాక్కం మురుగునీటి పంపింగ్ స్టేషన్ ఎదుట పనిచేస్తుందన్నారు. ఇతర వివరాలకు 81449 30908 నెంబరు సంప్రదించాలని పేర్కొన్నారు.

### 19న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ఐసిఎఫ్, మే 9: నగరంలోని కేఫా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఈ నెల 19న పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో జరుగనున్నాయి. బాలబాలికలకు వేర్వేరుగా 7,9,11,13,17 విభాగాల్లో ఓపెన్ విధానంలో జరుగనున్నాయి. మొద టి పది స్థానాలు పొందే క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లతో పాటు మొత్తం 156 బహుమతులు ప్రకటించారు. ఇతర వివరాలకు 9499915932 నెంబరు సంప్రదించవచ్చు.

### 3న కరుణానిధి శతవార్షికోత్సవాల ముగింపు వేడుకలు

ఐసిఎఫ్, మే 9: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతవార్షికోత్సవాల ముగింపు వేడుకలు జూన్ 3వ తేది నిర్వహించనున్నట్లు మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. కరుణానిధి శతవార్షికోత్సవాల ప్రారంభ వేడుకలు గత ఏడాది ప్రారంభమయ్యాయి. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు వివిధ శీర్షికలతో నిర్వహించి ప్రజా సంక్షేమ పథకాలు అమలుపరిచారు.ముగింపు వేడుకలను కరుణానిధి జయంతి రోజైన జూన్ 3వ తేది స్థానిక వేళచ్చేరిలో ఉన్న గురునానక్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 15 నుంచి గ్రూప్-2ఏ పోస్టుల కౌన్సెలింగ్

ఐసిఎఫ్, మే 9: గ్రూప్-2ఏ పోస్టుల కౌన్సెలింగ్ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుంది. టీఎన్‌పీఎస్సీ 2022 మే 21వ తేది గ్రూప్-2ఏ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించింది. అనంతరం మెయిన్స్ 2023 ఫిబ్రవరిలో జరిగాయి. ప్రిలిమినరీ మార్కులు, ర్యాంకుల జాబితా ఏప్రిల్ 8వ తేది విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో, గ్రూప్-2ఏ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ ఈ నెల 15 నుంచి జూన్ 20వ తేది వరకు బ్రాడ్‌వేలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనున్నాయి. కాల్ లెటర్లను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

### నేడు, రేపు పనిచేయని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు

ఐసిఎఫ్, మే 9: స్థానిక రాజీవ్‌గాంధీ రోడ్డులో పైప్ లైన్ మార్పిడి కారణంగా అడయార్, గాంధీనగర్, పల్లిపట్టు మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు శుక్ర, శనివారాల్లో పనిచేయవని చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. చెన్నై మెట్రోరైల్ సంస్థ ఆధ్వర్యంలో అడయార్ మండల పరిధిలోని రాజీవ్‌గాంధీ రోడ్డులో కొత్తగా పైప్ లైన్ వేయనున్నారు. ఈ కారణంగా 11వ తేది వరకు అడయార్ పాత మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం, గాంధీ నగర్ శుద్ధీకరణ కేంద్రం, పల్లిపట్టు శుద్ధీకరణ కేంద్రాలు తాత్కాలికంగా పనిచేయవని అధికారులు తెలిపారు.

### ఎగ్మూర్ నుంచి వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మే 9: ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్ నుంచి భువనేశ్వర్, సంబల్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06107 చెన్నై ఎగ్మూర్-భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 11, జూన్ 1వ తేదీల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మూర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06108 భువనేశ్వర్-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 12, జూన్ 2వ తేదీల్లో ఉదయం 9.30 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.
- నెం.06109 చెన్నై ఎగ్మూర్-సంబల్‌పూర్ ప్రత్యేక రైలు ఈ నెల 18, జూన్ 7వ తేదీల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మూర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06110 సంబల్‌పూర్-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 19, జూన్ 8వ తేదీల్లో ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.35 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.

### చెన్నై సెంట్రల్-బిట్రగుంట రైళ్ల రద్దు

పెరంబూర్, మే 9: విజయవాడ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా డా.ఎంజీఆర్ సెంట్రల్-బిట్రగుంట-డా.ఎంజీఆర్ సెంట్రల్ రైళ్లు మే, జూన్ నెలల్లోని పలు తేదీల్లో రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం ఈ నెల 27 నుంచి 31వ తేది, జూన్ 3 నుంచి 7, 10 నుంచి 14, 17 నుంచి 21వ తేది వరకు ఇరుమార్గాల్లో రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

### 8 విమానాల రద్దు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన కొనసాగించడంతో ఆ సంస్థకు చెందిన ఎనిమిది విమాన సర్వీసులు రద్దయినట్లు మీనంబాక్కం విమానాశ్రయ అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం రాత్రి 12 గంటలకు సింగపూరు నుంచి రావాల్సిన విమానం, కేరళలో తిరువనంతపురం నుంచి రావాల్సిన విమానం, గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు రావాల్సిన విమానం, రాత్రి 7.30 గంటలకు కోల్‌కతా నుంచి రావాల్సిన విమానం రద్దయ్యాయి. ఇదే విధంగా గురువారం వేకువజాము తిరువనంతపురానికి వెళ్లాల్సిన విమానం, సింగపూరు వెళ్లాల్సిన విమానం, కోల్‌కతాకు వెళ్లాల్సిన విమానం రద్దయ్యాయి.

## వైభవంగా పొర్‌కొడి అమ్మన్
# ఆలయ రథోత్సవం



వేలూరు, మే 9: ఆనైకట్టు సమీపం వేలంగాడు ప్రాంతంలోని పొర్‌కొడి అమ్మన్ ఆలయ రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా వల్లాండరామమ్, అన్నాచ్చిపాళ్యం, వేలంగాడు, పల్లాండుకాడు సహా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు కొబ్బరి ఆకుల పైకప్పుతో కూడిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఈ ఏడాది దిగుబడులు పెరగాలి, పశువులకు వ్యాధులు సోకరాదు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకూడదని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మేకలు, కోళ్లు బలి ఇచ్చి, ఆహారం తయారుచేసి వేడుకలకు వచ్చిన భక్తులకు అందజేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి రథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో కృష్ణగిరి, ధర్మపురి, చిత్తూరు, బెంగళూరు, చెన్నై సహా పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### రాహుల్ గాంధీ ప్రధాని కావాలి

● నారాయణస్వామి ఆకాంక్ష



పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి

పుదుచ్చేరి, మే 9: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నదే తన కోరిక అని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ప్రధాని మోదీ స్థాయి దిగజార్చుకుని అసత్యాలు మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని కఠిన పదజాలంతో దూషిస్తున్నారన్నారు. పదేళ్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల గురించి మాట్లాడకుండా ఓటమి భయంతో రోజుకో విధంగా ప్రతిపక్షాలపై అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. పోలింగ్ ముగిసినా మూడు విడతల లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి అధిక స్థానాలు వచ్చే అవకాశముందని, ఏడో విడతల ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి తప్పకుండా కేంద్రంలో అధికారం ఏర్పాటుచేస్తుందన్నారు. కూటమి నేతలంతా సమావేశమై రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేయాలని నారాయణస్వామి విజ్ఞప్తి చేశారు.

### వీధి కుక్క దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

పెరంబూర్, మే 9: నామక్కల్ జిల్లా రాశిపురం సమీపం వడుగం ప్రాంతాల్లో గురువారం ఉదయం కొందరు పిల్లలు ఆడుకుంటుండగా వీధి కుక్క వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని రాశిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుక్క దాడిలో ముఖానికి తీవ్రగాయాలైన బాలుడిని కుట్లు వేసిన వైద్యులు, మిగిలిన ఇద్దరికి కూడా చికిత్సలందిస్తున్నారు.

### హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, మే 9: రెండు నెలలుగా కావేరి నదిలో దోనెల సవారీకి నిషేధం విధించిన నేపథ్యంలో, గురువారం నుంచి నిషేధం ఎత్తివేయడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతం వద్ద ఎత్తైన బండరాళ్లు, వాటి మధ్యలో దోనెల్లో సవారీకి పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, మరమ్మతుల కారణంగా రెండు నెలలుగా హొగెనేకల్ కావేరి నదిలో దోనెల సవారీని జిల్లా యంత్రాంగం నిలిపివేయగా, ప్రస్తుతం పనులు ముగియడంతో గురువారం నుంచి దోనెల సవారీకి అనుమతించింది.

### ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

● ట్రోఫీ కైవసం చేసుకున్న సెయింట్ జోసఫ్ కళాశాల



ట్రోఫీతో సెయింట్ జోసఫ్ కళాశాల పురుషుల జట్టు

ప్యారీస్, మే 9: తిరువళ్లూర్ నొచ్చిమేడు ప్రాంతంలో నొచ్చి వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గురువారంతో ముగిశాయి. మొత్తం 65 టీములు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఫైనల్స్‌కు చేరుకున్న ఐక్యూ స్పోర్ట్స్ క్లబ్ టీమ్‌తో తలపడిన సెయింట్ జోసఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పురుషుల జట్టు ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీ దక్కించుకుంది. విజేత జట్టును సెయింట్ జోసఫ్ గ్రూప్ విద్యాసంస్థల చైర్మెన్ డా.బాబూ మనోహరన్ అభినందించారు.

### అనారోగ్యంతో భార్య మృతి..
## గుడి కట్టి ఆరాధిస్తున్న భర్త



గుడిలో ప్రతిష్ఠించిన కర్పగవళ్ళి విగ్రహం. కర్పగవళ్ళితో గోపాలకృష్ణన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): కష్టానష్టాల్లో తోడునీడగా నిలిచిన భార్య హఠాత్తుగా మృతి చెందటంతో చలించిపోయిన భర్త, ఆమె జ్ఞాపకాలను పదిలపరచుకునేలా గుడికట్టి కుంభాభిషేకం జరిపి ఆరాధిస్తున్నాడు. అరియలూరు జిల్లా దేవమంగళం గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ గ్రామంలోని గాంధీనగర్ ప్రాంతంలో గోపాలకృష్ణన్ (42), కర్పగవళ్ళి (36) అనే భార్యాభర్తలు నివసించేవారు. గోపాలకృష్ణన్ తిరుప్పూరులో జనపనార కర్మాగారాన్ని నడుపుతున్నారు. వీరికి ఐదేళ్ల వయస్సు కలిగిన కోమగన్ అనే కుమారుడున్నాడు. కర్పగవళ్ళి కిడ్నీలు దెబ్బతినడంతో ఆమె చికిత్స కోసం గోపాలకృష్ణన్ లక్షలాది రూపాయలను ఖర్చు పెట్టాడు. కానీ రెండు కిడ్నీలు ఒకే సమయంలో చెడిపోవటంతో గతయేడాది ఆమె తుదిశ్వాస విడిచింది. కర్పగవళ్లి మృతిదేహాన్ని గోపాలకృష్ణన్ తన ఇంటి సమీపంలోని స్థలంలోనే ఖననం చేశారు. అక్కడే రూ.15లక్షల వ్యయంతో ఆమెకు గుడికట్టాడు. ఆ గుడి గర్భాలయంలో మూడడగుల కర్పగవళ్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. గుడి నిర్మాణ పనులన్నీ ముగియడంతో బుధవారం వేదపండితులను రప్పించి కుంభాభిషేకం నిర్వహించారు. ప్రస్తుతం ఆ ఊరివాసులంతా ఈ గుడిని చూసి గోపాలకృష్ణన్‌ను మెచ్చుకుంటున్నారు.

### 23 రకాల విదేశీ శునకాలపై నిషేధం

పెరంబూర్, మే 9: రాష్ట్రంలో 23 రకాల విదేశీ శునకాలపై నిషేధం విధించారు. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్థక శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది.ఈనెల 5వతేది నగరంలో 5ఏళ్ల బాలికను రోట్‌వీలర్ రకానికి చెందిన పెంపుడు శునకాలు దాడిచేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మార్చి 12వ తేది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా, ఫారిన్ మిక్స్‌డ్, నాన్ మిక్స్‌డ్ డాగ్ రకాలైన పిట్‌బుల్ టెర్రీర్, అమెరికన్ స్ట్రబుల్, రోట్‌వీలర్స్ సహా 23 రకాల శునకాలు అత్యంత దూకుడు, ప్రమాదకరమైన జాబితాలో చేర్చబడ్డాయి. ఈ రకాల శునకాల విక్రయం, పెంచడంపై నిషేధం విధించారు.ఈరకమైన శునకాల యజమానులు వెంటనే వెటర్నరీ వైద్యులను సంప్రదించి వాటికి సంతానోత్పత్తి జరగకుండా స్టెరిలైజ్ చేయాలి. ఇలాంటి రకాలను బయటకు తీసుకెళ్లే సమయంలో దాని మెడకు ఇనుప గొలుసు, మూతికి కవచం విధిగా వేయాలని పశుసంవర్థక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

### వైభవంగా పాంచాలి అమ్మవారి వసంతోత్సవం



దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

పెరంబూర్, మే 9: తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు సమీపం మేలచ్చేరి గ్రామంలోని పాంచాలి అమ్మవారి ఆలయ అగ్ని వసంతోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడు, భీముడు, కృష్ణుడు వేషధారణలో కళాకారులు నృత్యాలు చేస్తూ అలరించారు. భీముడు దుర్యోధనుడిని వధించే సన్నివేశాన్ని కళాకారులు ప్రదర్శించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### తెలంగాణ ఎన్నికల బందోబస్తుకు రాష్ట్ర పోలీసులు

పెరంబూర్, మే 9: తెలంగాణలో సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు నగరం నుంచి 2,000 మంది హోంగార్డులు వెళ్లారు. చెన్నై పోలీసు శాఖలో పనిచేస్తున్న 1,000 మంది హోంగార్డులు ఎగ్మూర్ ఆర్ఆర్ మైదానానికి గురువారం ఉదయం చేరుకున్నారు. వీరితో పాటు మరో 1,000 మంది హోంగార్డులు తెలంగాణా ఆర్టీసీకి చెందిన 20 బస్సుల్లో సంగారెడ్డి జిల్లా భద్రతకు వెళ్లినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

### పీజీ టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు

ప్యారీస్, మే 9: రాష్ట్రంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీ గ్రేడ్ టీచర్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జూన్ నెలకు పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీ పోస్టుల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పీజీ టీచర్ల పోస్టుల్లో 50 శాతం పదోన్నతి ద్వారా, మిగతా 50 శాతం పోస్టులు టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్బీ) ద్వారా నియమించి భర్తీ చేస్తున్నారు. ఆ రీతిలో పీజీ గ్రేడ్ టీచర్ల పోస్టులలో ఖాళీయైన 200 స్థానాలను ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రకటన ఈ నెలాఖరులో విడుదల చేసి ఆగస్టులో టీఆర్బీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ గురువారం అన్ని జిల్లాల ప్రధాన విద్యాశాఖ అధికారులకు, హెచ్ఎంలకు ఉత్తర్వులిచ్చారు. పీజీ గ్రేడ్ టీచర్, వ్యాయామ విద్య డైరెక్టర్ గ్రేడ్-1, కంప్యూటర్ ట్రైనర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి ఖాళీయైన సీట్ల వివరాలను ప్రాధాన్యం వారీగా తయారుచేసి ఆన్‌లైన్ ద్వారా కార్యాలయానికి పంపించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

### ఆలయవేడుకల్లో మాజీ మంత్రి నృత్యం



యువకులతో డాన్స్ చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ విజయభాస్కర్

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలై సమీపంలోని తిరువేంగైవాసన్ ప్రాంతంలోని ప్రాచీన శివాలయం, పిడారి అమ్మన్ ఆలయ చిత్తిరై ఉత్సవాల్లో పాల్గొన్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డాక్టర్ విజయభాస్కర్ భక్తులతో కలిసి నృత్యం చేశారు. గతవారం ఆ రెండు ఆలయాల్లో వార్షిక చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజూ స్వామి, అమ్మవారు వివిధ వాహనాలలో ఊరేగుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మాజీ మంత్రి విజయభాస్కర్ ఆ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. ఆ సందర్భంగా వంటిపై శూలాలు గుచ్చుకుని మొక్కులు తీర్చేందుకు వచ్చిన యాభైమంది యువకులతో ఆయన నృత్యం చేశారు. ప్రస్తుతం ఆ డాన్స్‌కు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.

### కర్రసాము శిక్షణ ప్రారంభం



శిక్షణలో విద్యార్థులు

వేలూరు, మే 9: స్థానిక కాట్పాడిలో సింగతమిళన్ సిలంబు అకాడమీ ఆధ్వర్యంలో కర్రసాము వేసవి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణలో వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ ఈ నెల 30వ తేది వరకు జరుగుతుందని ప్రధాన కోచ్ టి.అరవిందన్ తెలిపారు. కోచ్‌లు శివశంకర్, భువనేష్, విఘ్నేశ్వరన్, లోకనాధన్ తదితరులు శిక్షణ ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు.

### ప్లస్ టూ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 9: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్లస్ టూ పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించిన 51 మంది విద్యార్థినీ, విద్యార్థులు గురువారం కలెక్టర్ సుబ్బులక్ష్మిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను అభినందించి వారికి పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా విద్యాధికారులు దయాళన్, రవి, ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

### సాంకేతిక లోపంతో దుబాయ్ విమానం రద్దు

అడయార్, మే 9: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు వెళ్లాల్సిన విమానం చివరి నిమిషంలో రద్దు చేశారు. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ విమానాన్ని రద్దు చేశారు. బుధవారం రాత్రి 10.30 గంటలకు చెన్నై నుంచి దుబాయ్‌కు మొత్తం 362 మంది ప్రయాణికులు, పది మంది క్రూ సిబ్బందితో ఎమిరేట్స్ విమానం బయలుదేరింది. అయితే, ఈ విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్టు ఇంజనీర్లు గుర్తించడంతో ఆ విమానాన్ని రద్దు చేశారు. ఆ విమానంలో దుబాయ్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులను నగరంలోని వివిధ హోటళ్లకు తరలించి తాత్కాలక బస కల్పించగా, మరికొందరు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. చివరి నిమిషంలో సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో 372 మంది అదృష్టవశాత్తు ప్రాణగండం నుంచి బయటపడ్డారు.

### కోవై ఎయిర్‌పోర్టులో బంగారు కడ్డీలు స్వాధీనం

అడయార్, మే 9: కోయంబత్తూరు విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడి నుంచి రూ.90లక్షల విలువైన బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి కోయంబత్తూరు వచ్చిన విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఒక ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి అతడి వద్ద రూ.90.28లక్షల విలువచేసే పది బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు.ఆ ప్రయాణికుడి వద్ద ఎయిర్‌పోర్టు అధికారులు విచారణ జరుపుతున్నారు.

### పేరుమోసిన రౌడీ సహా ముగ్గురి అరెస్టు

అడయార్, మే 9: స్థానిక మైలాపూరులో పేరు మోసిన రౌడీ సహా ముగ్గురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. వరుస నేరాలకు పాల్పడుతూ స్థానికులను భయభ్రాంతకులకు గురిచేయడంతో పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించారు. మైలాపూర్, అభిరామిపురం ప్రాంతానికి చెందిన శరత్ అలియాస్ వెల్లై శరత్ (26) పేరుమోసిన రౌడీగా చెలామణి అవుతున్నాడు. ఈయన తన స్నేహితులు రాహుల్ (24), ప్రవీణ్ (25)తో కలిసి వరుస నేరాలకు పాల్పడుతూ, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. వీరిపై స్థానికులు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈ ముగ్గురు రౌడీలను అరెస్టు చేశారు.

### కొడైకెనాల్ ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తా

ఏడుగురికి గాయాలు

ప్యారీస్, మే 9: దిండుగల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొడైకెనాల్ ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తాపడిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. కడలూరు జిల్లా చిదంబరం ప్రాంతం నుంచి 18 మంది ఓ వ్యానులో కొడైకెనాల్ సందర్శించేందుకు వెళ్లారు. పర్యటన ముగించుకొని వారు పళని వైపు గురువారం బయల్దేరారు. ఘాట్ రోడ్డులో నవరికాడు ప్రాంతంలో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ చంద్రమోహన్ సహా ఏడుగురికి గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్లిన పళని ఆర్టీఏ అధికారి జయగౌరి క్షతగాత్రులను తన వాహనంలో ఎక్కించుకొని పళని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### పిడుగుపాటుకు యువకుడి మృతి

పెరంబూర్, మే 9: పిడుగుపాటుకు యువకుడు మృతిచెందిన ఘటన తిరువారూర్ జిల్లాలో చోటుచేసుకుంది. మన్నార్‌కుడి సమీపం కీల్‌పుళదికుడికి గ్రామానికి చెందిన ఆకాష్ (23) గురువారం మధ్యాహ్నం పశువులను మేత కోసం సమీపంలోని పొలాలకు తోలుకెళ్లాడు. ఆ సమయంలో హఠాత్తుగా ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. ఆకాష్ సమీపంలో చెట్టు కిందకు వెళ్లగా సమీపంలో పిడుగు పడడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### క్రికెట్‌లో ఘర్షణ

● స్టంప్‌తో దాడి... యువకుడి మృతి

పెరంబూర్, మే 9: తిరువారూర్ జిల్లా ఆలంగుడిలో క్రికెట్ ఆడుతుండగా ఏర్పడిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసి ఓ యువకుడు మృతిచెందాడు. అజిత్‌కుమార్ (25) వేసిన బంతికి బ్యాటింగ్ చేస్తున్న 14 ఏళ్ల బాలుడు అవుటయ్యాడు. కానీ, తాను అవుటవ్వలేదని ఆ బాలుడు అజిత్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగాడు. అక్కడే ఉన్న బాలుడి 15 ఏళ్ల అన్న కూడా అజిత్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగాడు. ఒకానొక సమయంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో బాలుడి అన్న కోపంగా స్టంప్ తీసుకొని అజిత్ తలపై కొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

### తల్లి మృతదేహంతో ఆరు రోజులు...

● తూత్తుకుడిలో కలకలం

పెరంబూర్, మే 9: తూత్తుకుడి సమీపంలో బుద్ధిమాంద్యం కలిగిన కుమారుడు తల్లి మృతదేహంతో ఆరు రోజులు ఉన్న ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. అయ్యనడైప్పు శివశక్తి నగర్‌లోని ఓ ఇంటి నుంచి దుర్వాశన వస్తుండడంతో చుట్టుపక్కల వారు సిప్కాట్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ మోహన్‌రాజ్ నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటికి చేరుకొని మహమ్మద్ గులాంను విచారించారు. ఈ నెల 2వ తేది తల్లి ఆషా ఫైరోజ్ మృతిచెందినట్లు, తమకు బంధులెవ్వరూ లేకపోవడంతో తానే తల్లి మృతదేహాన్ని ఇంట్లోనే గుంత తీసి పూడ్చిపెట్టినట్లు మహ్మద్ తెలిపాడు. దీంతో, పోలీసులు గుంత నుంచి ఆషా ఫైరోజ్ మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక మేరకు ఆమెది హత్యా? సహజ మరణమా? అనే విషయం నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు.

### వాహనాలకు స్టిక్కర్లపై నిషేధం

● ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, మే 9: వాహనాలకు స్టిక్కర్, ప్రకటనలపై నిషేధం విధించే నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నగరానికి చెందిన దేవదాస్ గాంధీ విల్సన్ మద్రాసు హైకోర్టులో వేసిన పిటిషన్‌లో... నగరంలోని అన్ని వాహనాలకు పోలీసు, న్యాయవాది, ప్రెస్, డాక్టర్ తదితర స్టిక్కర్లు వేయరాదని నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఈ ఉత్తర్వుల్లో పలు సందేహాలున్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు చెన్నై నగరానికి మాత్రమేనా? ఇతర జిల్లాలకు వర్తిస్తుందా? అనే విషయమై ఉత్తర్వుల్లో స్పష్టత లేదన్నారు. వాహనాల ముందు, వెనుక నటీనటుల ఫొటోలు, మత చిహ్నాలు, రాజకీయపార్టీల నేతల ఫొటోలను స్టిక్కర్లుగా వేయడంపై నిషేధం విధిస్తున్నట్లు పేర్కొన్నారని, ఈ నిషేధం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేలా ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన హైకోర్టు దీనిపై అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదావేసింది.

### అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ప్యారీస్, మే 9: ఆన్‌లైన్ యాప్ ద్వారా తీసుకున్న అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై నగర పోలీసులు విచారణ చేపట్టారు. పుదుపేట ప్రాంతానికి చెందిన మణి, ధనలక్ష్మి దంపతులకు సెంథిల్, గోపినాథ్ అనే ఇద్దరు కుమారులున్నారు. గోపినాథ్ ఎగ్మూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. అతను కొద్దిరోజుల క్రితం తన మిత్రుల కోసం ఆన్‌లైన్ లోన్ యాప్ ద్వారా రూ.40,000 రుణం తీసుకున్నడు. ప్రతి నెలా వడ్డీ సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ సంబంధిత సంస్థ, గోపినాథ్ ఫొటోను అశ్లీలంగా చిత్రీకరించి విడుదల చేసింది. దీనిని అవమానంగా భావించిన గోపినాథ్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని గోపినాథ్ తన వాట్సాప్ స్టేటస్‌లో పోస్ట్ చేశారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని తన సోదరుడు సెంథిల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని గోపినాథ్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి సంబంధిత ఆన్‌లైన్ లోన్ యాప్ సంస్థ గురించి విచారణ చేపట్టారు.

### హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

అడయార్, మే 9: తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరులో హెల్త్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసే రఘువరన్ (45) ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా కలకలం రేపింది. కన్నియాకుమారి జిల్లా, కోలిమేడు ప్రాంతానికి చెందిన ఈయన.. సాత్తనూరులో హెల్త్ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నారు.ఈయన చెన్నమ్మాళ్ అనే మహిళను ప్రేమ వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో రఘువరన్ ఉన్నట్టుండి అస్వస్థతకు లోనుకావడంతో తిరువణ్ణామలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే, గత రెండు రోజులుగా ఆయన తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయన గురువారం తెల్లవారుజామున 3.30 సమయంలో ఆస్పత్రి నుంచి బయటకు వెళ్ళి రోడ్డుపై వెళుతున్న లారీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

### మందుల దుకాణంలో చోరీ.. యువకుడి అరెస్ట్

ప్యారీస్, మే 9: స్థానిక పుళల్ వినాయకపురంలోని మందుల దుకాణంలో రూ.8 లక్షలతో పరారైన జైపాల్ (30) అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సెంథిల్‌కుమార్ నడుపుతున్న మందుల దుకాణంలో ఈ నెల 3వ తేది రాత్రి చొరబడిన గుర్తుతెలియని యువకుడు రూ.8 లక్షలు దోచుకొని పరారైనట్లు పుళల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మందుల దుకాణం పరిసరాల్లో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించి ఆదంబాక్కంకు చెందిన జైపాల్‌ను గురువారం అరెస్ట్ చేశారు.

### జైలులోకి గంజాయి విసిరిన వ్యక్తి కోసం గాలింపు

ప్యారీస్, మే 9: స్థానిక పుళల్ ప్రాంతంలోని సెంట్రల్ జైలు ప్రాంగణంలోకి గంజాయి పొట్లం విసిరిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పుళల్ జైలు ప్రాంగణంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్లాస్టిక్ బ్యాగ్‌లో చుట్టిన ఓ పొట్లం విసిరి వెళ్లిపోయినట్లు జైలు వార్డెన్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ఈ పొట్లాన్ని విప్పిచూడగా అందులో 14 గ్రాముల గంజాయి ఉండడంతో జైలు సూపరింటెండెంట్‌కు అప్పగించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా గంజాయి విసిరిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పుళల్ పోలీసులు తెలిపారు.

### లారీ డ్రైవర్ దారుణహత్య

ప్యారీస్, మే 9: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపంలోని కేఎన్ కండిగై ప్రాంతంలో శివకుమార్ (33) అనే లారీ డ్రైవర్ హత్యకు గురైన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కేఎన్ కండిగైకు చెందిన శివకుమార్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంటి బయట కూర్చొని శివకుమార్ మద్యం సేవిస్తున్న సమయంలో ఓ ముఠా అతనితో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. ఆ ముఠా నుంచి తప్పించుకొనేందుకు యత్నించిన శివకుమార్‌ను వెంటాడిన ఆ ముఠా మారణాయుధాలతో హత్య చేసి పరారైనట్లు తెలిసింది. దీనిపై అందజేసిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పొన్నేరి పోలీసులు పరారైన హంతకుల కోసం గాలిస్తున్నారు.

### కోనేటిలో మునిగి అక్కా తమ్ముడి మృతి

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా మహాదానపురం ప్రాంతంలోని ఆలయ వేడుకలకు వెళ్లిన ప్రియా (12), షివాలి (12) అనే అక్కా తమ్ముడు కొలనులో మునిగి దుర్మరణం చెందారు. ఆలయ వేడుకల్లో పాల్గొని మధ్యాహ్నం భోజనం చేసిన ఇద్దరు చేతులు కడిగేందుకు కొలనులో దిగి జారిపడి నీట మునిగారు. వారి కేకలకు పరుగెత్తుకొచ్చిన కొందరు కొలనులో దూకి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆలస్యం కావటంతో ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలు వెలికి తీశారు.

### ఎండకు సొమ్మసిల్లిన రామచిలుక

● కాపాడిన కానిస్టేబుల్



రామచిలుకకు నీరు పెడుతున్న కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యం

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కలెక్టర్ కార్యాలయం వద్ద ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిన రామచిలుకను డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యం కాపాడి పలువురి ప్రశంసలందుకున్నారు. నేలపై పడిన రామచిలుకను బాలసుబ్రమణ్యం ఇతర పోలీసులు నీటితొట్టి దగ్గరకు తీసుకెళ్ళి దానిపై నీటిని చిలకరించారు. ఆ తర్వాత కాస్త తేరుకున్న ఆ చిలుకకు నీళ్లు తాగించి ఆహారం పెట్టారు. బాగా కోలుకున్న ఆ చిలుక రివ్వున పైకెగిరింది. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వారు అది చూసి కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యంపై ప్రశంసల వర్షం కురిపించారు.



ఆలయ రాజగోపురం

ఆధ్యాత్మికం

## ద్వితీయ వైష్ణవ దివ్యదేశం

# అళగియ మనవాళర్ ఆలయం

- కల్యాణయోగాన్నిచ్చే కమలవళ్ళి తాయార్
- పెరుమాళ్‌కు ధీటుగా నాచ్చియార్ స్వర్గద్వార ప్రవేశం





కమలవళ్ళి తాయార్ - స్వర్గద్వార ప్రవేశం చేస్తున్న కమలవళ్ళి తాయార్



ఆలయ ప్రవేశద్వారం

తిరుచ్చి జిల్లా ఉరైయూరు అళగియ మనవాళర్ పెరుమాళ్ ఆలయం అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాలలో రెండవదిగా కీర్తినొందింది. ఈ దివ్యక్షేత్రం తిరుక్కోళి, ఉరంధై, నిగళాపురి, తిరుఉరయూర్ ఇలా దివ్యనామాలతో పన్నీరు ఆళ్వార్లలో ఒకరైన తిరప్పాణాళ్వార్ అవతార స్థలం కూడా పేరొందింది. చోళరాజ్యం ఏనుగు ఉరయూరుకు విచ్చేసినప్పుడు ఓ కోడి (తమిళంలో కోళి) దానిపై దాడి చేసి తరిమికొట్టడం వల్ల ఈ ప్రాంతానికి 'కోళియూర్' అని 'తిరుక్కోళియూరు' అనే పేర్లొచ్చాయి. భక్తుల కోరికలు నెరవేర్చేది, క్షేత్రంగా, ప్రత్యేకించి వివాహ, సంతాన భాగ్యాలందించే అమ్మవారి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. తిరుమంగై ఆళ్వార్ తాను రచించిన పెరియ తిరుమొళిలో ఓ పాశురంలో ఈ క్షేత్రం గురించి మంగళాశాసనమొనర్చారు. ఆలయంలోని కమలవళ్ళి తాయార్ పెళ్లీడు యువతులకు కల్యాణయోగాన్ని ప్రసాదించే కరుణామూర్తిగా పేరుగడించారు. ఇక ఏ వైష్ణవాలయంలోనూ లేని విధంగా ఈ ఆలయంలో అమ్మవారు ఏకాదశి రోజున స్వర్గద్వార ప్రవేశం చేసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. అటు స్వామివారు (వైకుంఠ ఏకాదశినాడు), ఇటు అమ్మవారు వేర్వేరు ఏకాదశి దినాల్లో స్వర్గద్వార ప్రవేశం చేసే అరుదైన క్షేత్రంగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

### స్థలపురాణం...

ద్వాపరయుగంలో ధర్మవర్మ చోళచక్రవర్తి వంశీయుడైన నంద చోళరాజు ఉరైయూరు ప్రాంతాన్ని పరిపాలించారు. శ్రీరంగనాథుడి భక్తుడైన ఈయనకు చాలా కాలం వరకూ



అళగియ మనవాళర్ పెరుమాళ్ సమేత కమలవళ్ళి తాయార్

సంతానం కలుగలేదు. దీంతో దిగులు చెందిన నందచోళరాజు శ్రీరంగనాథుని దర్శించి తనకు సంతానయోగం కల్పించమని వేడుకున్నారు. రంగనాథస్వామి ఆ భక్తుడి కుమార్తెగా అవతరించాలని మహాలక్ష్మిని ఆదేశించారు. ఓ పర్యాయం నందచోళరాజు వేటకు వెళ్ళినప్పుడు ఓ తటాకంలో తామరపుష్పంపై అందమైన ఆడ శిశువు పడుకుని ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. బిడ్డ తల్లిదండ్రుల జాడ కోసం వెదికినా ఎవరూ కనిపించలేదు. చివరకు ఆ బిడ్డ శ్రీరంగనాథుడిచ్చిన వరంగా భావించి ఆ శిశువును తీసుకెళ్ళి 'కమలవళ్లి' అని నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచారు. యుక్తవయస్సు రాగానే ఆమెకు వివాహనం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఓ రోజు కమలవళ్ళి చెలికత్తెలతో వనంలో ఆటలాడుతుండగా అశ్వారూఢుడై వెళ్తున్న శ్రీరంగనాథుడిని చూసి మురిసింది. పెళ్ళంటే చేసుకుంటే ఆ స్వామినే చేసుకుంటానంటూ తండ్రితో చెప్పింది. ఈ నేపథ్యంలో నందచోళరాజు కలలో రంగనాథ



అళగియ మనవాళర్ సన్నిధి

స్వామి ప్రత్యక్షమై కమలవళ్ళిని పరిణయమాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో నంద చోళరాజు కమలవళ్ళిని శ్రీరంగం క్షేత్రానికి తీసుకెళ్ళారు. స్వామివారి ఎదుట మొక్కుతుండగా కమలవళ్ళి శ్రీరంగనాథస్వామిలో ఐక్యమైంది. దీంతో స్వామివారు తన కుమార్తెను పరిణయమాడినట్లు భావించి నంద చోళరాజు ఎంతో సంతోషపడ్డారు..

### నాచ్చియార్ తిరుకోలమ్...

మహాలక్ష్మీ అమ్మవారి అవతార క్షేత్రం కనుక ఈ ఆలయాన్ని నాచ్చియార్ కోయిల్ అని పిలుస్తున్నారు. అంతే కాకుండా ఆలయంలో భక్తులంతా అమ్మవారికే అగ్రతాంబూలం ఇస్తున్నారు. ఆలయంలో పెరుమాళ్‌కు నిర్వహించే అన్ని పూజలు కమలవళ్లి తాయార్‌కూడా చేయడం విశేషం. మూలస్థానంలో అళగియ మనవాళ్ పెరుమాళ్, కమలవళ్ళి తాయార్ నూతన వధూవరుల అలంకరణతో ఉత్తరాభిముఖంగా భక్తులకు దర్శనమిస్తుంటారు. వివాహ ఆటంకాలున్నవారు ఆయిల్యం నక్షత్రంలో అమ్మవారికి ప్రత్యేక అర్చన జరిపితే త్వరగా వివాహయోగం కలుగుతుందని వైష్ణవాగమ పండితులు చెబుతారు.

### ఆలయ వైభవం...

ఐదంతస్థుల రాజగోపురంతో ఈ ఆలయం నిర్మితమై ఉంది. ఆలయ ప్రాకారంలో నమ్మాళ్వార్, రామానుజులవారికి ప్రత్యేక సన్నిధులున్నాయి. ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని పురావస్తు పరిశోధకులు తేల్చి చెప్పారు. ఆలయ అంతర ప్రాకారంలో స్తంభాల మంటపం విశేషంగా ఆకట్టుకుంటుంది. నాచ్చియార్ సన్నిధికి ఇరువైపులా అందమైన శిల్పాలున్నాయి. ఆలయానికి చేరువగానే కల్యాణ తీర్థం ఉంది. అళగియ మనవాళర్ మంటప ప్రవేశానికి ఇరువైపులా జయ విజయుల విగ్రహాలున్నాయి.

### ఆలయ విశేషాలు...

వైకుంఠ ఏకాదశికి స్వామివారు స్వర్గద్వార ప్రవేశం చేస్తే, అమ్మవారు తై లేదా మాసి మాసాల్లో వచ్చే ఏకాదశి పర్వదినాల్లో స్వర్గద్వారం ప్రవేశం చేయడం ఇక్కడి ఆలయ విశేషం. పంగుణి ఉత్తిరం వేడుకల్లో శ్రీరంగనాథస్వామి ఆలయంలోని నంబెరుమాళ్ ఈ క్షేత్రానికి వచ్చి భక్తులను అనుగ్రహిస్తారు. మళ్ళీ స్వామివారి శ్రీరంగం క్షేత్రానికి వెళ్ళి రంగనాయకి తాయర్ సమేతులై వచ్చి ప్రత్యేక సేవలు అందుకుంటారు. పురటాసి నవరాత్రి వేడుకలు, కార్తీక తిరుప్పాణాళ్వార్ బ్రహ్మోత్సవాలు, మార్గశిర వైకుంఠ ఏకాదశి 21 రోజుల వైభవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఆలయంలో స్వామి వారికి ఉత్సవమూర్తి లేదు కానీ అమ్మవారికి మాత్రమే ఉత్సవవిగ్రహం ఉంది. సాధారణంగా వైష్ణవాలయాల్లో కుంకుమను ప్రసాదంగా ఇస్తారు. అయితే ఈ ఆలయంలో కుంకుమకు బదులుగా చందనాన్ని ప్రసాదంగా ఇస్తారు. ఇక అమ్మవారికి సమర్పించే నైవేద్యంలో మిరపకాయలు కాకుండా మిరియాల పొడి కలిపిన ఆహార పదార్థాలనే సమర్పిస్తారు.



అంతర ప్రాకారంలో స్తంభాల మండపం



కళ్యాణతీర్థం

### ఎలావెళ్ళాలి?

తిరుచ్చి రైల్వేస్టేషన్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోను, శ్రీరంగం ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలోనూ ఈ ఆలయం ఉంది. తిరుచ్చి నగరానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, రైళ్ళు, విమానాలు నడుపుతున్నారు. తిరుచ్చి నుంచి టవున్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటలవరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

**స్వామివారి నామధేయం :** అళగియ మనవాళర్,
**అమ్మవారి నామధేయం :** కమలవళ్ళి నాచ్చియార్
**తీర్థం :** కమల పుష్కరిణి, కళ్యాణతీర్థం
**విమానం :** కమల విమానం

## అధర్వ సరసన నిమిషా





మలయాళంలో నటనలో రాక్షసిగా గుర్తింపు పొందిన నటి నిమిషా సజయన్. మాలీవుడ్‌లో ఆమె నటించిన 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్, 'నాయాట్టు' వంటి చిత్రాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. హీరో సిద్ధార్థ్ నటించిన 'సిత్తా' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన నిమిషా నటించిన 'మిషన్ చాప్టర్ ఒన్' అనే చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో యువ నటుడు అధర్వ మురళి సరసన నిమిషా నటిస్తోంది. ఈ చిత్రానికి 'డీఎన్ఏ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'డాడా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాలను నిర్మించిన ఒలింపియా పిక్చర్స్ అధినేత అంబేత్ కుమార్ నిర్మిస్తున్నారు. 'మాన్‌స్టర్', 'ఒరునాల్ కూత్తు', 'ఫర్హానా' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలను రూపొందించిన నెల్సన్ వెంకటేశన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధర్వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ చిత్రం వివరాలతో పాటు ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ రిలీజ్ చేసింది. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.



## సోనియాకు వరుస ఛాన్సులు

చిత్రజ్యోతి

'7జీ రెయిన్‌బో కాలనీ' ఫేం సోనియా అగర్వాల్ ఇపుడు బిజీ నటి అయింది. తమిళం, తెలుగు, మలయాళ భాషా చిత్రాల్లో క్షణం తీరికలేకుండా నటిస్తోంది. ముఖ్యంగా కోలీవుడ్‌లో చిన్న బడ్జెట్ చిత్రాల ఆస్థాన నటిగా మారిపోయింది. దెయ్యం కథా చిత్రాలంటే దర్శక నిర్మాతలకు ఠక్కున గుర్తుకు వచ్చే నటిగా సోనియా గుర్తింపుపొందింది. మరోవైపు సింగిల్ ఆల్బమ్స్‌లో నటిస్తోంది. ఇదే విషయంపై ఆమె స్పందిస్తూ, 'నాకు సినిమా అవకాశాలు ఏమాత్రం తగ్గలేదు. మలయాళంలో 'బిహైండ్' అనే సినిమాలో నటించాను. తమిళంలో రెండు, తెలుగులో రెండు చిత్రాలున్నాయి. మరికొన్ని ప్రాజెక్టులకు సంబంధించి సంప్రదిస్తున్నారు. గతంలో నటించిన '7జీ రెయిన్‌బో కాలనీ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తే చాలా సంతోషం. మంచి కథతో నా మాజీ భర్త సెల్వరాఘవన్ కొత్తగా చిత్రానికి దర్శకత్వం చేస్తే అందులో నటించేందుకు నేను సిద్ధం' అని పేర్కొన్నారు.

## విజయ్ చిత్రంలో ఎస్‌కే 'కేమియో' పాత్ర



విజయ్ - శివకార్తికేయన్

వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ హీరోగా నటిస్తున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (ది గోట్) మూవీలో మరో ప్రముఖ హీరో శివకార్తికేయన్ కేమియో రోల్ చేయనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఏజీఎస్ నిర్మాణ సంస్థ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, స్నేహ, మీనాక్షి చౌదరి, యోగిబాబు వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. యువన్ శంకర్ రాజా సంగీతం. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్ర కథకు సంబంధించి వన్‌లైన్ స్టోరీ కూడా తెలియదు. చెన్నై, కేరళ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. ఈ నేపథ్యంలో హీరో శివకార్తికేయన్ కేమియో రోల్ చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ పాత్రలో ఆయన 15 నిమిషాల పాటు ఎస్‌కే వెండితెరపై కనిపించనున్నారట. ఎస్‌కే పార్ట్‌కు సంబంధించిన షూటింగ్ కూడా చెన్నైలో జరుగుతుందని, ఇందులో విజయ్, ఎస్‌కే పాల్గొన్నట్టు సినీ వర్గాల సమాచారం. దీంతో ఇటు విజయ్, అటు ఎస్‌కే అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, శివకార్తికేయన్ తన 23వ చిత్రం మురుగదాస్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెల్సిందే.

## డి.ఇమ్మాన్ సంగీతంలో తొలిసారి పాడిన మనో



కోలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు డి.ఇమ్మాన్ సంగీత స్వరకల్పనలో ప్రముఖ గాయకుడు మనో తొలిసారి ఓ పాట పాడారు. ఏఆర్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణంలో అజ్మల్ ఖాన్, రేయా హరి కలిసి నిర్మిస్తుండగా, లోకేష్ అజిల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లెవన్' చిత్రం కోసం ఆయన గాత్రదానం చేశారు. నవీన్ చంద్ర, రియా హరి జంటగా నటిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా రూపుదిద్దుకుంటుంది. కొన్నేళ్ళుగా చిత్రపరిశ్రమలో ఇమ్మాన్ సంగీత దర్శకుడిగా, మనో గాయకుడిగా కొనసాగుతున్నప్పటికీ వీరిద్దరు ఇంతవరకు ఒక్క చిత్రంలో కూడా కలిసి పనిచేయకపోవడం గమనార్హం. ఇపుడు 'లెవన్' చిత్రం కోసం వీరిద్దరు కలిసి పనిచేస్తునానరు. ఈ తరుణంపై మనో మాట్లాడుతూ, 'ఇమ్మాన్ సంగీతాన్ని ఎంతోకాలంగా ఆస్వాదిస్తున్నాను. ఆయన సంగీత దర్శకత్వంలో పాడటం చాలా సంతోషంగా ఉంది. మంచి బాణీతో ఉన్న ఈ పాట బాగా ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఇమ్మాన్ మాట్లాడుతూ, 'మనోతో కలిసి పనిచేయలేకపోయానన్న చిన్నపాటి అసంతృప్తి నాలో ఉండేది. అది ఇపుడు తీరిపోయింది. ఆయన గాత్రానికి అతికినట్టుగా సరిపోయే ఒక మంచి పాటను ఆలపించారు' అని పేర్కొన్నారు.

→ స్టూడియోలో ఇమ్మాన్‌తో మనో

# నేటినుంచి ఊటీలో పుష్ప ప్రదర్శన

- సందర్శకులను ఆకట్టుకొనేలా ప్రత్యేక ఏర్పాట్లు



పుష్ప ప్రదర్శనకు సిద్ధమైన బొటానికల్ పార్క్



పుష్పాలతో తయారవుతున్న డైనోసార్ నమూనా

ఐసిఎఫ్, మే 9: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన గిరి పర్యాటక స్థలాల్లో ఊటీ ప్రధానమైనది. ఇక్కడ శీతల ప్రదేశాన్ని ఆస్వాదించేందుకు అనేకమంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. వారిని ఆకర్షించేలా ప్రతి ఏటా వేసవి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికి వేసవి ఉత్సవాలు ఊటీ బొటానికల్ పార్క్‌లో శుక్రవారం 126వ పుష్ప ప్రదర్శనతో ప్రారంభం కానున్నాయి. 11వ తేదీ ప్రారంభమయ్యే ప్రదర్శన 20వ తేది వరకు జరుగనుంది. దీనిని పురస్కరించుకొని బొటానికల్ పార్క్‌లో వివిధ రకాలకు చెందిన 5 లక్షల పూలమొక్కలను పెంచారు. ఇన్కా మేరీగోల్డ్, ఫ్లగ్స్, పెటూనియా, ఫాన్సీ, డయాంతస్, బిగోనియా, డేలియా, పాల్సం, రెనన్ ప్లస్, వయోలా, అజరేటం, కాలండులా, గ్లాడియోలస్, విలియం, సన్‌ఫ్లవర్ వంటి 65,000 పూలకుండీలను ప్రదర్శనలో ఉంచనున్నారు. ఈసారి వివిధ రంగుల లక్ష రోజా పూలతో తయారుచేసిన బ్రాండ్ డిస్నీ వరల్డ్, పుట్టగొడుగు, ఆక్టోపస్, ఫ్లవర్ టవర్లతో పాటు 10 రకాల పూల అలంకరణలు, పలు లక్షల రోజా పూలు, కార్నేశన్, ఎరుపు రంగు పూలతో కూడిన అలంకరణ చేయనున్నారు. ఇందుకోసం బెంగళూరు, హోసూరు ప్రాంతాల నుంచి కార్నేశన్ పూలు ఊటీకి దిగుమతి చేసుకున్నారు. ఇవి మినహా పలు రకాల పూలతో 10 అలంకరణ స్టాట్యూలు, రంగోలీ ఏర్పాటుచేశారు. పిల్లలను ఆకట్టుకొనేలా వన్యమృగ ఆకారాలు, కార్టూన్ బొమ్మలు పూలతో రూపొందించి ప్రదర్శించనున్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పూలు, కూరగాయలు, పండ్లు, సుగంధద్రవ్యాల ప్రాధాన్యత వివరించేలా వివిధ జిల్లాల నుంచి ప్రదర్శనా వస్తువులు తెప్పించి ఎగ్జిబిషన్‌లో ఉంచనున్నారు. ఈ ఏడాది పుష్ప ప్రదర్శన ప్రత్యేక కార్యక్రమంగా ప్రదర్శన ప్రారంభమయ్యే శుక్రవారం, ముగింపు రోజైన 20వ తేది లేజర్ షో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. పర్యాటకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారు. ఇదే విధంగా ఊటీ విజయనగరం ప్రాంతంలో ఏర్పాటుచేసిన రోజా పూల ప్రదర్శన శుక్రవారం ప్రారంభం కానుంది. 4,200లకు పైగా రకాల 32,000 వివిధ రంగుల రోజా మొక్కలు సందర్శకులను ఆకట్టుకొనేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ-పాస్ విధానంలో పర్యాటకుల సంఖ్య తగ్గిన నేపథ్యంలో, పుష్ప ప్రదర్శన, రోజా ప్రదర్శనలు ప్రారంభంతో రాబోయే రోజుల్లో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## నరువి ఆస్పత్రిలో పెరాలసిస్ విభాగం ఏర్పాటు

వేలూరు, మే 9: స్థానిక నరువి ఆస్పత్రిలో పెరాలసిస్ విభాగాన్ని అస్సాం రాష్ట్ర గవర్నర్ గురువారం ప్రారంభించారు. ఆస్పత్రి డైరెక్టర్ సంపత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అసోం రాష్ట్ర గవర్నర్ గులాబ్‌చంద్ కటారియా ముఖ్య అతిథిగా హాజరై అధునాతన పరికరాలతో ఏర్పాటుచేసిన పెరాలసిస్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... మానవ జన్మకు సార్థకత చేకూరేలా ప్రజలకు ప్రేమతో సేవలు చేయాలన్నారు. నరువి ఆస్పత్రి అందిస్తున్న వైద్యం, సేవలు అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఉపాధ్యక్షుడు నితిన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెరాలసిస్ విభాగాన్ని ప్రారంభిస్తున్న అసోం గవర్నర్ గులాబ్ చంద్

## కమల్‌తో మంత్రి కేఎన్ నెహ్రూ భేటీ


ప్యారీస్, మే 9: మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, సినీనటుడు కమల్‌హాసన్‌తో రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ, డీఎంకే ఎంపీ ఏ.రాజా బుధవారం సమావేశమయ్యారు. ఆళ్వార్‌పేటలోని మక్కల్ నీది మయ్యం పార్టీ కార్యాలయంలో సుమారు గంట సేపు జరిగిన ఈ సమావేశంలో రాజకీయాల గురించి చర్చించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న కమల్‌హాసన్‌కు డీఎంకే తరపున మంత్రి కేఎన్ నెహ్రూ కృతజ్ఞతలు తెలిపారు. కమల్‌హాసన్ మామ శ్రీనివాసన్ మృతికి మంత్రి నెహ్రూ సంతాపం తెలిపారు.



కమలతో చర్చిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ



శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయాన్ని దర్శించిన జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరించిన ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు





# జన చైతన్యం



? మీ అబ్బాయికి ఓటెందుకెయ్యాలి భూమనా

# అరాచక ముఠాల అడ్డాగా తిరుపతి

సందర్భానికి తగిన వస్త్రధారణ.. ఖణేల్‌మని మోగే గొంతు.. మాటల్లో మానవీయత.. తరచూ పుస్తకాల ప్రస్తావన.. పదేపదే గుర్తు చేసే ఎమర్జెన్సీ జైలు జీవితం.. మిలిటెంట్ ఉద్యమాల నేపథ్యం.. మఠాధిపతులకు పాద నమస్కారాలు.. విభిన్నమైన నాయకుడిగా తిరుపతి ప్రజలకు చిరపరిచితుడు భూమన కరుణాకరరెడ్డి. వైఎస్ రాజారెడ్డిని గుర్తు చేసుకుంటూ.. గురువుగా రాజశేఖర్‌రెడ్డి అండతో ఎదుగుతూ.. జగన్‌రెడ్డికి విధేయంగా ఉంటూ రాజకీయాలను బ్యాలెన్స్ చేసుకుంటున్న ఈయన.. వారసత్వ రాజకీయాలమీద నమ్మకం లేదంటూనే, తన కుమారుడు భూమన అభినయరెడ్డిని తిరుపతి శాసనసభ ఎన్నికల్లో పోటీకి దించారు. కొడుకును గెలిపించే బాధ్యత మొత్తం తన భుజాలమీద వేసుకుని ప్రచారంలో మునిగితేలుతున్నారు. అభివృద్ధి కావాలంటే అభినయ్‌కే ఓటేయాలని చెబుతున్నారు. ఇంతకీ ఈ ఐదేళ్లలో తిరుపతిలో జరిగిన అభివృద్ధి ఏమిటి...? ఆ అభివృద్ధిపై పరచుకున్న అనుమానపు నీడల్లో నిజానిజాలేమిటి.. అనే చర్చ ఎన్నికల వేళ తిరుపతి నగరంలో విస్తృతంగా జరుగుతోంది. విపక్షాలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలు, సంధిస్తున్న ప్రశ్నలు, ప్రజల్లో వినిపిస్తున్న సందేహాలు.. ఇవి..

## గంజాయివనం — ఎవరు కారకులు?

గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిని మద్యరహిత నగరంగా ప్రకటించాలంటూ మోకాటి లోతు నీళ్లలో నిరసన ప్రకటించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంగతే ఎత్తలేదు. ఎమ్మెల్యే అయ్యాక తిరుపతిలో గంజాయి విపరీతంగా పెరిగిపోయిందంటూ వీడియో కెమెరాలు వెంటబెట్టుకుని నగర శివార్లలో పాడుబడ్డ భవనాలు, రైలు పట్టాల వెంట పరుగులు తీసి హడావుడి చేశారు. ఆతర్వాత దాన్నీ ఆయన పట్టించుకోలేదు. విశేషం ఏమిటంటే ఆయన ఎమ్మెల్యే అయ్యాకే తిరుపతిలో మద్యం విచ్చలవిడిగా పెరిగింది. నగరం గంజాయి వనంగా మారిందనే విమర్శలూ పెరిగాయి. నగరంలో గుట్కా, గంజాయి అమ్మకాలను కేంద్రీకృతం చేసి నెలనెలా భారీ మొత్తాలు దండుకుంటున్నారనే ఆరోపణలూ భూమన కుటుంబం ఎదుర్కోవాల్సి వచ్చింది. తులసివనంలాంటి తిరుపతి ఆధ్యాత్మికనగరంలో గంజాయి విశ్వరూపం చూసి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

## దొంగ ఓట్లు — వేళ్లన్నీ అభినయ్ వైపే

భారతదేశంలోనే అతి పెద్ద దొంగ ఓట్ల కుంభకోణం తిరుపతిలో జరిగింది. లోక్‌సభ ఉప ఎన్నికల్లో 34వేల ఫేక్ ఎపిక్ కార్డులను ఏకంగా ఎన్నికల వెబ్‌సైట్‌లోకే లాగిన్ అయ్యి డౌన్‌లోడ్ చేసుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘమే ప్రకటించింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లూ బలవుతున్న ఈ కేసులో అసలు సూత్రధారి భూమన కుమారుడు అభినయరెడ్డి అని విపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. తిరుపతి ప్రతిష్ఠను తీవ్రంగా మంటగలిపిన ఉదంతంగా ఇది చరిత్రలో మిగిలిపోనుంది.

## నిర్లక్ష్యం — గంగమ్మకే అపచారం

తిరుపతి ప్రజల విశ్వాసాలను కూడా గత ఐదేళ్లగా కాలరాశారనే విమర్శలు పెరిగాయి. తిరుపతి గంగమ్మగుడి పునరుద్ధరణ పేరుతో మొత్తం గర్భగుడి సహా కూలగొట్టేసి, మూలవిరాట్‌ను గుడ్డలో చుట్టి ఆఫీసు భవనంలో పెట్టేసిన తీరు గంగమ్మ భక్తులను ఆవేదనకు గురిచేసింది. గంగ జాతర సంప్రదాయాలను కూడా మార్చేశారు. ఏ విషయంలోనూ స్థానికులను సంప్రదించలేదు. రాష్ట్ర పండుగ అంటూ జాతర నిర్వహణకు నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టలేకపోయిన నాయకులు, స్థానిక వ్యాపారులను బాదేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది ఎన్నికల పేరులో ఏకంగా గంగజాతరనే వారం వెనక్కి నెట్టేశారు. అధికార నేతల దౌర్జన్యాలకు భయపడిన స్థానికులు ఈ అపచారాలన్నింటికీ గంగమ్మ లెక్కతేలుస్తుందని అంటుంటారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్లు — టీడీఆర్ బాండ్ల పేరుతో కోట్ల కుంభకోణం

మాస్టర్‌ప్లాన్ రోడ్లంటూ నగర శివార్లలో నివాసాలు కూడా లేని ప్రాంతంలో విశాలమైన రోడ్లు వేశారు. ఆగమేఘాల మీద సాగిన ఈ రోడ్ల నిర్మాణంలో టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.2000 కోట్లు భూమన నొక్కేశారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఎస్వీ యూనివర్శిటీనే చీలుస్తూ మూడు రోడ్లను వేయబోయిన వీరు, నగర ప్రజల వ్యతిరేకతతో వెనక్కి తగ్గాల్సివచ్చింది. కేవలం రూ.46 కోట్ల ఖర్చుతోనే 40 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్నామంటూ ఢంకా మోగించి చెప్పినా.. ఈ రోడ్ల భూసేకరణ పేరుతో నష్టపరిహారం కింద రూ.1013 కోట్లు టీడీఆర్ బాండ్లుగా చెల్లించారు. తిరుపతి వైసీపీ అభ్యర్థి అభినయరెడ్డి మానసపుత్రికగా ప్రకటించిన ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్ల వెనుక వేల కోట్ల కుంభకోణం ఉందని వెలుగు చూడడం విశేషం.

### ఈ ప్రశ్నలకు బదులేది?

? 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుగుణమ్మ 842 ఓట్లతో విజయం సాధించారని మీడియాలో వచ్చిన తర్వాత ఏం జరిగింది. 708 ఓట్లతో ఎలా గెలిచారు.

? కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవాల వెనుక మీ బెదిరింపులు నిజం కాదా.

? టీటీడీ, కార్పొరేషన్ పనుల్లో పదిశాతం కమిషన్ నిజం కాదా.

? మేయర్ పదవిని బీసీలకు ఎరజూపి, డిప్యూటీ మేయర్ ముసుగులో కార్పొరేషన్‌ను గుప్పెట్లో పెట్టుకోవడం నిజం కాదా.

? టీడీపీ హయాంలో మొదలైన గరుడ వారధి పనులను కమీషన్‌ల కోసం నిలిపివేసింది నిజం కాదా.

? వీధి వీధిలో గంజాయి బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నది వైసీపీ నాయకులు కాదా?

? 2009, 2014 ఎన్నికల్లో కడప నుంచి రౌడీలను తెప్పించి అరాచకాలను సృష్టించింది భూమన కాదా.

# సౌమ్యుల పాలనలో రౌడీరాజ్యం

**ఖాళీగా ఉంటే కబ్జా:** వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తిరుపతిలో కడప భూ అక్రమణ ముఠాలు ఏవిధంగా పెచ్చుమీరిపోయాయో, అంతకుమించి జగన్‌రెడ్డి పాలనలో తిరుపతి కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఖరీదైన స్థలాలు ఖాళీగా ఉంటే నకిలీ పత్రాలతో ఆక్రమించడం.. లబోదిబోమని అధికారపార్టీ నాయకులకు మొర పెట్టుకుంటే..'కూర్చుని మాట్లాడుకోండి' అని సలహాలివ్వడం.. కూర్చుంటే కోట్లు డిమాండ్ చేయడం..ఇలా తిరుపతి కబ్జాకోరల్లో విలవిలలాడుతోంది. మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రవాసాంధ్రుల స్థలాలను కూడా వీరు వదిలిపెట్టలేదు. వీళ్లు ఇంకో ఐదేళ్లు అధికారంలో ఉంటే తిరుపతిలో ఎవరి ఆస్తులూ దక్కవనే భయాందోళనలు పెరిగిపోయాయి.

**ముఠా మినిస్ట్రీ:** నగరంలో డివిజన్‌ల వారీగా రౌడీ ముఠాలు తయారయ్యాయి. వీరికి యువనేత సారథి అని ఆరోపణలున్నాయి. తన ముఠాలో ఒక్కొక్కరికీ ఒక్కో ప్రభుత్వ విభాగాన్ని కేటాయించి అక్కడ ఏ పనులు కావాలన్నా వారి ద్వారానే జరగాలనే ఆదేశాలు అమలయ్యేలా చూస్తున్నారు. కమిషనర్ అయినా, కార్పొరేటర్లైనా, రెవెన్యూ అధికారులైనా, పోలీసులైనా వీరు చెప్పిందే జరగాలి. దీనికి యువరాజుగారి మంత్రివర్గం అనే పేరు కూడా వాడుకలోకి వచ్చేసింది.

**22ఏ బాగోతం:** తిరుపతిలో ఎడా పెడా భూములన్నీ హఠాత్తుగా 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. శరణు శరణంటూ వెళ్లడమో లేదా ముడుపులతో సంతృప్తి పరచడమో చేస్తే మాత్రం ఒక్కటొక్కటిగా 22ఏ నుంచి మినహాయించారు. ఇదే తీరులో ఆర్టీసీ బస్టాండు, చింతల చేను, పెద్దకాపు వీధి ఉన్న దాదాపు 188 ఎకరాలు టీటీడీ భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్నిచోట్ల 22ఏ నిషేధం తొలగించి.. అంతా తమ దయతోనే జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. భయపెట్టి, బెదిరించి, లొంగదీసుకునే విచిత్ర వ్యూహాన్ని అధికార పార్టీ నేతలు అవలంబిస్తున్నారు.

**అలిపిరి కొండవాలునా అవినీతి:** అలిపిరి నుంచి జూపార్కు వరకు ఉన్న 2000 ఎకరాల విలువైన టీటీడీ భూముల మీద కూడా కన్నుపడింది. ఇక్కడ దేవలోక్‌కు కేటాయించిన భూమిని స్టార్ హోటల్ నిర్మాణానికి కట్టబెట్టేశారు. ఆ స్టార్ హోటల్ కోసమే యూనివర్శిటీలో అడ్డంగా రోడ్లు వేయాలనుకున్నారనే ఆరోపణలు వచ్చాయి.

**బాబోయ్ ఎన్నికలా!:** ప్రశాంత తిరుపతిని ప్రతి ఎన్నికల్లోనూ అశాంతిమయం చేశారు. కార్పొరేషన్ ఎన్నికలు, లోక్‌సభ ఉప ఎన్నిక, టౌన్‌బ్యాంకు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన తీరే ఇందుకు ఉదాహరణ. అధికారపార్టీ రౌడీరాజ్యం తిరుపతిలో ఎలా ఉందో నిరూపణ అయ్యింది. నామినేషన్లే వేయనివ్వకుండా బెదిరించడం, వినకపోతే కొట్టడం, నామినేషన్ కాగితాలు చించేయడం, ఆస్తులమీద దాడులు చేయడం.. వంటివి యథేచ్ఛగా జరిగాయి.

## స్థానికులపై కక్ష — పెదకాపు లేఅవుట్‌లో రోడ్డు తవ్వేశారు

తిరుపతి నగరంలో గుండెవంటి ప్రాంతాలైన పెద్దకాపు లేఅవుట్, పెద్దకాపు వీధులపై భూమన కుటుంబం పగ పట్టిందనే నిందను వారు మోయాల్సి వస్తోంది. వారధి నిర్మాణం పేరుతో ఈ ప్రాంతంలోని హోటల్స్, లాడ్జీలకు దారి లేకుండా తవ్వేశారు. వారు ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తే గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేయనందుకే అని తేల్చి చెప్పారని ప్రచారం జరిగింది. కోరినంత ముడుపులిస్తే తప్ప దారి ఉండదని చెప్పడంతో ఆ ప్రాంత వాసులు ఆగ్రహాన్ని కడుపులో దాచుకుని ఉన్నారు. స్థానిక రెడ్డి సామాజికవర్గం పట్ల భూమన కుటుంబానికి కక్ష అనేందుకు ఇదే సాక్ష్యమని ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు.

## ఈ ఆస్తులు ఎలా వచ్చాయి?

**ఏ వ్యాపారాలూ చేయని, వ్యవసాయం చేయని భూమన కరుణాకరరెడ్డి కుటుంబం ఆస్తుల మీద కూడా ఆరోపణలున్నాయి. కేవలం ఒక జిరాక్స్ కేంద్రంలో భాగస్వామిగా ఉండే కరుణాకరరెడ్డి వందల కోట్ల ఆస్తిపరుడు ఎలా అయ్యాడని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ ఉంటాయి. ఆయన అధికారం అడ్డం పెట్టుకుని ఆస్తులు సంపాదించాడంటూ, అందుకు సాక్ష్యంగా కొన్ని ఉదంతాలు చూపిస్తుంటాయి.**

- కరుణాకర రెడ్డి తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో (2005-06) అభినయ్ రెడ్డి పేరిట 21 సార్లు ఆస్తులు కొనుగోలు జరిగాయి. వడమాల పేట మండలం ఎస్వీపురం వద్ద 5.84 ఎకరాలు (ప్రస్తుతం టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చిన ప్రాంతం), సూరప్పకశం టౌన్‌షిప్ సమీపంలోని గాజులమండ్యంలో 13.82 ఎకరాలు కలిపి మొత్తంగా 19.66 ఎకరాల భూమిని తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే కుమారుడు అభినయరెడ్డి పేరిట ఆస్తులు కొనుగోలు జరిగింది.
- టీటీడీ ఛైర్మన్ అయ్యాక (2007-08)లో మూడు కొనుగోళ్లు జరిగాయి. 2008లో తిరుపతి రూరల్ కొత్తూరు దగ్గర 1.37 ఎకరాల స్థలం అభినయ్ పేరిట కొనుగోలు జరిగింది. తిరుచానూరు గ్రామ లెక్కదాఖలాలో రెండు ఎకరాలు (సర్వే 473/4) 2021లో కరోనా సమయంలో సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నివాసం ఉంటున్న పద్మావతిపురంలో 2011లోనే నాలుగు చోట్ల రెసిడెన్షియల్ ఆస్తులను కొనుగోలు చేశారు. 2008లో హైదరాబాదులో 2225 చ.అడుగులు కలిగిన ఓ రెసిడెన్షియల్ బిల్డింగ్ అభినయ్ ఆస్తుల ఖాతాలో ఉంది. ఇక భార్య పేరిట 2011లో (సెజ్ సమీపంలో) వరదయ్యపాళం, పాండూరు దగ్గర- 28 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ వచ్చింది.





## రోజమ్మ కలిపింది అందరినీ...

నగరి నియోజకవర్గంలో నాయకులంతా ఏకమవుతున్నారు. ఇదేదో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజా రాజకీయ చతురత, నాయకత్వ పటిమతోనే సాధ్యమైందనుకుంటే పొరబడినట్టే. దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థి వర్గాలుగా కొనసాగుతున్న నేతలంతా ఇప్పుడు రోజా ఓటమి కోసం చెట్టాపట్టలేసుకుంటున్నారు. నిండ్ర మండలంలో రెడ్డివారి కుటుంబం ఏళ్ల తరబడి టీడీపీతో పోరాటం చేసింది. ఐదేళ్లుగా రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురం లక్ష్మీపతిరాజు ఇదే తీరున టీడీపీ గూటికి చేరారు. పుత్తూరులో డీఎన్ ఏలుమలై కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీతో హోరాహోరీగా తలపడినా రోజా తీరు నచ్చక గత నెలలో టీడీపీలో చేరారు. వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి 2014,2019లో వైసీపీకి బలంగా పనిచేశారు. టీడీపీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో రాజకీయాలు నెరిపారు. వైసీపీలో ఉక్కబోతను భరించలేక టీడీపీ కండువా కప్పుకున్నారు. కొసమెరుపు ఏంటంటే చాన్నాళ్లుగా వైరి వర్గాలుగా వ్యవహరించిన ఈ నాయకులంతా కొద్దిరోజులుగా సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. గాలి భానుప్రకాష్ గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రోజా ఓటమే సింగిల్ పాయింట్ ఎజెండాగా వీరు పనిచేస్తున్నారు. - పుత్తూరు అర్బన్

## 'స్వాను' ప్లాను బెడిసికొడుతోంది...

తమ వ్యూహాలు ప్రత్యర్థి పార్టీ వారికి తెలిసిపోతున్నాయని మండల వైసీపీ శిబిరం కలవరపడుతోంది. తామేం చేయబోతున్నామో టీడీపీ వారు ముందుగా పసిగట్టేస్తున్నారని తలపట్టుకుంటోంది. ఐదేళ్లక్రితం ముఖ్య ప్రజాప్రతినిధి విజయానికి వైసీపీలో చాలామంది నాయకలు,కార్యకర్తలు చెమటోడ్చి పనిచేశారు. పార్టీయే సర్వస్వమని భావించి జెండా మోశారు. అధికారం వచ్చాక సదరు ముఖ్య ప్రతినిధి వీరందరినీ పట్టించుకోవడం మానేశారు. తనకు నచ్చిన వారితో కోటరీ ఏర్పరుచుకున్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారిలో సింహభాగం వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. టీడీపీలో చేరిపోయిన వీరంతా ఇప్పుడు అక్కడ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం వైసీపీ నాయకుల్లో గుబులు రేపుతోంది. వార్డుల్లో తామేం చేయబోతున్నామో టీడీపీ నేతలకు తెలిసిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పార్టీ వీడిన వారి వల్లే ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. తమ ఆనుపానుల గురించి బాగా తెలియడంతో వ్యూహాలు లీక్ అవుతున్నాయని గ్రహించారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీ,పోల్ మేనేజిమెంట్ లాంటి కీలక పద్ధతులు కూడా ఎలా జరుగుతాయో టీడీపీ శిబిరానికి తెలుస్తుండటంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. - రేణిగుంట



## మందుబాబుల అల్టిమేటం




డబ్బులిచ్చినా.. మందు పోయిస్తేనే ప్రచారానికి వస్తామని కొందరు తెగేసి చెబుతుంటే వారికి నచ్చజెప్పడానికి పార్టీల నాయకులు నానాతంటాలు పడుతున్నారు. ఒక అడుగు ముందుకేసి మద్యం లేకుంటే తమను ప్రచారానికి పిలవద్దంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. అడిగినంత మందు దొరకడంలేదబ్బా....ఎక్కడ నుంచి తీసుకొచ్చి ఇవ్వాలంటూ సర్దిచెబుతున్నా మందుబాబులు వినడంలేదు. వీరి మొండిపట్టుతో తిరుపతిలోని పార్టీల వార్డు బాధ్యులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. శనివారం వరకూ వీరిని కాపాడుకునేందుకు కాళ్లావేళ్లాపడి బతిమలాడుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడం సమస్యగా మారింది. ఏదోలా మద్యం దుకాణాలను మేనేజ్ చేద్దామన్నా కుదరడం లేదు. పరిమితికి మించి అమ్మితే ఫ్లయింగ్ స్క్వాడ్ కేసులు పెడుతోందని షాపుల వారు జంకుతున్నారు. ఇప్పటికే 12 మందిని తీసేశారు..ఎక్కువ మందు ఇవ్వడం తమవల్ల కాదంటున్నారు. చేసేదిలేక తమిళనాడు నుంచి చీప్ లిక్కర్ తీసుకొచ్చి అడ్డదారుల్లో పంపిణీ చేస్తున్నారు. తిరుపతి నగరంలోని చాలా వార్డుల్లో ఈ తలనొప్పి సన్నివేశాలు కనిపిస్తున్నాయి.
-తిరుపతి(నేరవిభాగం)

## క్యాంపస్ సెలక్షన్లు కనుమరుగు

నేను సైతం



మాది ఏర్పేడు మండలం కొత్త కాల్వ గ్రామం. నాన్న నాదముని రెడ్డి సన్నకారు రైతు. ఆ రోజుల్లో రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు వచ్చేవి కావు. 1999లో చంద్రబాబు నాయుడు సీఎం అయ్యారు. ఆయన ముందు చూపుతో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి చాలా కృషి చేశారు. చంద్రబాబు చొరవతో ఆ రంగం వేళ్లానుకుని చాలా మందికి బతుకు దారి చూపించింది. ఆయన సమర్థ నాయకత్వంపై నమ్మకంతో మానాన్న నన్ను 2001లో ఇంజినీరింగ్ చదివించారు. చెన్నైలో నెలకు రూ.1.5 లక్షల జీతం వస్తోంది. ఆనాడు చంద్రబాబు చేసిన అభివృద్ధి ఫలితంగా నా కుటుంబం పేదరికాన్ని జయించింది. అయితే గడచిన ఐదేళ్లుగా వైసీపీ పాలనలో శ్రీకాళహస్తితోపాటు రాష్ట్రం పరిస్థితి దారుణంగా మారిపోయింది. చదువుకున్న యువత ఉద్యోగాలు లేక దారి తప్పుతున్నారు. స్కూల్ పిల్లల సైతం మద్యం తాగుతున్నారని తెలుసుకుంటే బాధ, భవిష్యత్ మీద ఆందోళన కలుగుతున్నాయి. గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరిగిపోయింది. ఐదేళ్ల నుంచి పేరున్న కాలేజీల్లో సైతం క్యాంపస్ సెలక్షన్లు నిలిచిపోయాయి. ఎంపికకు రావడానికి కంపెనీలు భయపడిపోతున్నాయి. నాణ్యమైన సాంకేతిక విద్య కోసం విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులు గాడిన పడాలంటే చంద్రబాబును మళ్లీ గెలిపించుకోవాలి. ఆయన సీఎం అయితే తప్ప రాష్ట్రం బాగుపడదు.. అందుకే సెలవు పెట్టి వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నాను. టీడీపీ అధికారంలోకి రావలసిన అవసరం గురించి వివరిస్తున్నాను.

- లోకేష్ కుమార్

-శ్రీకాళహస్తి

## నమ్మకస్తుల కోసం వేట

ఎన్నికలు దగ్గరకొచ్చేశాయి. ప్రచారం గడువూ ముగిసిపోతోంది. దీంతో నగదు పంపిణీపై కీలక నాయకులు దృష్టి పెట్టారు. ఇందులో పాత్ర పోషించే అత్యంత నమ్మకమైన వారి కోసం నాయకులు ఆరా తీస్తున్నారు. గత ఎన్నికల్లో పనిచేసిన వారి గుణగణాలను తెలుసుకుంటున్నారు. డబ్బులు నొక్కేస్తారనుకున్నవారిని దూరం పెడుతున్నారు. ప్రాంతాల వారీగా పంపిణీ చేయాల్సిన మొత్తంపై లెక్కలేయడంలో తలమునకలై ఉన్నారు. ఓటర్లందరికీ ఒకే తీరుగా కాకుండా కేటగిరీలుగా విభజించి పంచాలని వీరు భావిస్తున్నట్లు సమాచారం. ఖచ్చితంగా తమకు అనుకూలంగా వేసేవారు, డబ్బులిస్తేనే ఓటేస్తారనుకునేవారు, ఇచ్చినా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి ఓటేస్తారనుకునేవారు.. ఇలా కేటగిరిల వారీగా ఎవరెవరు ఎంతమంది ఉంటారనే కోణంలో అభ్యర్థులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. కొందరు చోటామోటా నాయకులు ఇప్పటికే అభ్యర్థుల సన్నిహితులను సంప్రదించడం మొదలెట్టారు. తమ చేతిలో ఇన్ని ఓట్లున్నాయంటూ బేరాలకు దిగుతున్నారు. వీరిలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో ముఖ్య నేతలు తెలియక తలపట్టుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా సంఘటనలు జరుగుతున్నాయని సమాచారం. గెలుపు ఓటములను ప్రభావితం చేసే నగదు పంపిణీ విషయంలో నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.
-తిరుపతి(ఆంధ్రజ్యోతి)



## ఆ వాహనమే గెలిపిస్తోందా...

సెంటిమెంట్

రాజకీయ నాయకుల్లో చాలామంది సెంట్‌మెంట్లను గట్టిగా నమ్ముతారు. కొందరికి ముహూర్తాలు, మరికొందరు దైవ దర్శనం .. ఇలా రకరకాల సెంట్‌మెంట్లను పాటిస్తుంటారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరసారత్నం తాను మొదట పోటీ చేసిన సమయంలో ఉపయోగించిన అంబాసిడర్ కారునే ఎన్నో ఎన్నికలకు వాడారు. ఆ వాహనం నంబరు 1234. కార్లు మారినా ఆ నంబరును మాత్రం ఆయన వదులుకోడానికి ఇష్టపడరు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు కూడా వాహన నంబరు సెంటిమెంటెక్కువే. 9వ నంబరు ప్లేటుండే కారునే వాడుతుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ నంబరున్న బ్లాక్ కలర్ ఇన్నోవాలోనే వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఖచ్చితంగా ఈ వాహనంలోనే ప్రయాణిస్తారు. ఈసారీ అదే సెంటిమెంట్ ఫాలో అవుతున్నారు. - తడ



మాజీ మంత్రి పరసారత్నం వాడుతున్న ఇన్నోవా